

# పుస్తక పరిచయం




*Pallavi*
*H-96, Madhuranagar*
*Hydearbad – 500 038*
*pallavirg@rediffmail.com*

**తెలుగు** చలనచిత్ర రంగంలో చిరస్థాయిగా నిలిచిపోయే పేరు ‘సావిత్రి‘..మామూలు ‘సావిత్రి‘ కాదు ‘మహానటి‘ సావిత్రి. ఆమె జీవితం కాల్పనిక నవలకన్నా ఎక్కువమలుపులతో సాగింది. ఎక్కడో గుంటూరు జిల్లాలోని మారుమూల పల్లెటూళ్ళో పుట్టి , చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి బెజవాడ పెదనాన్న ఇంట చేరి..అలా మద్రాసు చేరి నింగికెగిసిన తార నేల కొరుగుతుందని ఎవరూ కలలోనైనా ఊహించలేదు. కార్లు, బంగళాలు మందీ మార్బలంతో ఊహించని వైభవాల వెలుగులో సాగిన జీవితం గవర్నమెంటు హాస్పిటల్లో కటికనేలమీద పడుకునే దుస్థితి రావడం..పగవారికి సైతం వద్దనుకునే అధోగతి! 596 రోజులు కోమాలో ఉండి 1981లో కన్నుమూసిన మహానటి సావిత్రిని అత్యంత గాఢంగా అభిమానించిన ‘పల్లవి‘ గారు రాసిన ఈ పుస్తకం ఒన నవలా రూపంలో సాగింది. ఎవరో మూడో వ్యక్తి కథ చెప్పినట్లు కాకుండా వీలైనన్ని చోట్ల పాత్రలు, సంభాషణల ప్రక్రియలో సాగిన ఈ పుస్తకం ఏకబిగిన చదివిస్తుంది. సావిత్రి జీవితంలోని ఎన్నో మలుపుల్ని చాలా బాలెన్స్‌డ్‌గా వ్రాసారు రచయిత్రి. మంచి వ్రాయడానికి పెద్ద నేర్పు అవసరంలేదు కానీ జీవితంలో హాని చేసిన వాళ్ళ గురించీ, మోసం చేసిన వాళ్ళ  గురించీ వ్రాయాలంటే ఎంతో సంయమనం ఉండాలి. సావిత్రి జీవితంలో అలాంటి పాత్రలే ఎక్కువ. ఇలాంటి సన్నివేశాలని ఎంతో నేర్పు ఉన్న రచయిత్రిలా వ్రాసిన ‘పల్లవి‘ గారిని అభినందించి తీరాలి. ఇది వీరి తొలి రచన అంటే నమ్మ బుద్ధి  కాదు. ఎంతమందిని సంప్రదించి ఎన్ని వ్యయప్రయాసలకోర్చారో కానీ సావిత్రి అధిరోహించిన నటశిఖరమంత సమగ్రంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు రచయిత్రి. అరుదైన చిత్రాలూ, ఇంకా అరుదైనా పత్రికాంశాలూ సమకూర్చి పుస్తకానికి పరిపూర్ణత చేకూర్చారు. కొన్ని చోట్ల కాల్పనిక సంఘటనలు (ఉదా. సూసన్ హేవర్డ్ రాసిన్ ఉత్తరం) ఉన్నట్లు గుమ్మడిగారి ముందుమాట ద్వారా తెలిసింది. అలాంటివి ఎక్కువ ఉండిఉంటే వాటి గురించి ఎక్కడైనా పేర్కొని ఉంటే బావుండేది. ఇది పెద్దలోపమేం కాదు కానీ దీని లేమిలో పుస్తకంలోని సంఘటనలన్నీ 100 శాతం యదార్థాలే అనుకోవాలి.

తప్పక చదవ దగిన విలువైన రచన ఈ పుస్తకం.

***




చక్కటి, చిక్కటి కథల సంపుటి ఈ 'గోరంతదీపం'. ప్రతి నాలుగు పేజీలు కథలుగా చెలమణి అవుతున్న ఈ రోజుల్లో దాదాపు మూడు, నాలుగు దశాబ్దాల క్రిందట ప్రచురితమైన ఈ కథలు 'అసలైన' కథలకి నిర్వచనంగా నిలుస్తాయి. ఈ సంపుటిలో అధికశాతం మధ్యతరగతి జీవితాలనీ, వ్యక్తులనీ, వ్యక్తిత్వాలనీ ప్రతిబింబించేవే. కథ ఎత్తుగడ ఎంత ఆసక్తిదాయకంగా వుంటుందో ముగింపు అంత ఆశ్చర్యకరంగానూ ఉంటుంది. ఇది చూడండి 'వెంకట రత్నం పట్ల నాకు సానుభూతి లేదు. వెంకటరత్నం పట్ల సానుభూతి చూపించే వారిపట్ల నాకు అసహ్యం మాత్రమే ఉంది' ఈ వాక్యం చదివిన పాఠకుడు ముందుకి సాగకుండా ఉండడం అసాధ్యం..! గుండెల్ని పిండేసే కరుణరసం (తండ్రి చుట్టలకోసం తన ప్రచురణకాని రచనలని చిత్తుకాగితాలుగా అమ్మెయ్యడం..), భుజం పట్టి నిలదీసి ప్రశ్నించే పాత్రలూ ఈ సంపుటి నిండా ఉన్నాయి. శైలీ, శిల్పం, కథా, కథనం..ఏ తూనిక రాయైనా తీసుకోండి..ఈ కథలు ప్రథమ స్థాయిలో నిలుస్తాయి. ఏ కథలోనైనా ఒక్క వాక్యం దాటేసినా కథలో ఎంతో కోల్పోతారు. ఇంతటి నేర్పు చాలా తక్కువమంది రచయితలకి ఉంటుంది. రచయిత శ్రీ రామారావు 'విశాఖ సాహితి' వ్యవస్థాపక కార్యదర్శి, వృత్తి రీత్యా కూడా అనేక పురస్కారాలు పొందారు. కథలన్నీ చదివాక మిగిలేది ఒకటే ప్రశ్న ' ఇంత మంచి కథలు వ్రాసిన రచయిత ఇంతకాలం మనకెందుకు కనిపించలేదు!?" అని. కథలని ప్రేమించే వాళ్ళు..'మంచి కథలు' మాత్రమే చదవాలనుకునే వాళ్ళు తప్పక చదవాల్సిన పుస్తకం ఇది. 'చదవండి..చదివించండి..' అన్న నినాదం ఈ పుస్తకానికి అతికినట్లు సరిపోతుంది.

***

***Mallapragada Rama Rao***
***A-9,Sayi Vihar Residency***
***Sus Road, Pashan***
***Pune – 411 021***
***020-2587 0083***

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor
KOUMUDI(Web Monthly)
4251 Escudo Ct
Dublin, CA 94568,USA